తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల  కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
సోమవారం,01.07.2024  పేజీలు : 08
Follow :

# బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్

## ఫిరాయింపుల్లో ఆ రెండు పార్టీలకు తేడా లేదు



- బీజేపీ ఎమ్మెల్యేలకు నిధులివ్వకపోవడం దుర్మార్గం
- మా మంచితనాన్ని చేతగానితనంగా భావించొద్దు.
- కేంద్రంకూడా అలానేచేస్తే ఏమవుతుందో ఆలోచించండి
- అన్ని పార్టీలను సమదృష్టితో చూడాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- టీ 20 వరల్డ్ కప్ భారత్ గెలుపుపై హర్షం

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి)** పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులు, నిధుల కేటాయింపు, సింగరేణి ప్రైవేటీకరణ దుష్ప్రచారం సహా అన్ని అంశాల్లోనూ కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. నిధులు కేటాయింపు, అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో బీజేపీ ఎమ్మెల్యేలపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు సైతం ప్రజలు ఓట్లేస్తేనే గెలిచారనే సంగతిని గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే పరిస్థితి ఎట్లుంటుందో ఆలోచించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని, అందులో భాగంగా రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు తమ వద్దకు వస్తే పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు. ఆదివారం రోజు ఉదయం కరీంనగర్ లో బండి తనను కలిసిన మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు.

**పార్టీ ఫిరాయింపులపై....**
బీఆర్ఎస్ కు, కాంగ్రెస్ కు తేడా లేదు. రెండు పార్టీలు ఫిరాయింపులకు పాల్పడుతున్నయ్. గతంలో బీఆర్ఎస్ చేస్తే... ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోంది ఇది సిగ్గు చేటన్నారు.

**నియోజకవర్గ నిధుల కేటాయింపుపై...**
కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు నిధులకు కేటాయింపులో తీవ్ర వివక్ష చూపుతూ దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే అభివృద్ధి నిధులిస్తోంది. బీజేపీ ఎమ్మెల్యేలకు నిధులివ్వడం లేదు. బీజేపీ గెలిచిన చోట్ల ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులకు నియోజకవర్గ ఇంఛార్జీలుగా పెట్టి నిధులిస్తోందని ఇది సరికాదన్నారు. ప్రజలిచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉంది. నిధులివ్వకుంటే ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరతారనే భావనతో వ్యవహరిస్తోంది. కేంద్రంలో బీజేపీ ఉంది. మేం కూడా అట్లనే చేస్తే మీ పరిస్థితి ఏమిటి? తెలంగాణ పరిస్థితి ఏమిటి ఒక్కసారి ఆలోచించండి. మేం పార్టీలకు అతీతంగా గెలిచిన ఎంపీలకు నిధులిస్తున్నాం. అన్ని రాష్ట్రాలను

మిగతా 2లో..

పారమిత విద్యార్థుల

# విజ్ఞాన యాత్ర

**కరీంనగర్ బ్యూరో, జూన్ 30 (జనంసాక్షి)** స్థానిక మంకమ్మతోటలోని పారమిత పాఠశాల నాలుగో తరగతి విద్యార్థులు చేగుర్తి గ్రామపంచాయతీ, గోపాలస్వామి దేవాలయము, ప్రకృతి వనం, చెరువు, గ్రామీణ క్రీడా క్షేత్రం సందర్శించడం జరిగింది. విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రకృతిని పరిశీలించి గ్రామపంచాయితి సందర్శించారు. గ్రామపంచాయితి సెక్రెటరీతో విద్యార్థిని విద్యార్థులు అనేక ప్రశ్నలు వేసి వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. దేవాలయాన్ని సందర్శించి వేణుగోపాలస్వామి ప్రాముఖ్యతను, చారిత్రాత్మక నేపథ్యంను విద్యార్థిని విద్యార్థులు తెలుసుకున్నారు. అంతే కాకుండా ప్రకృతివనం, చెరువును సందర్శించి కొత్త విషయాలను తెలుసుకోవడంలో ఆసక్తిని కనబరిచారు. చాలా అంశాలను తెలుసుకొని ఆనందించడం జరిగిందన్నారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థులు పాల్గొని అమూల్య మైనటువంటి విషయాలను గ్రహించారు. ఇటువంటి పర్యటనలు పిల్లలమనో వికాసానికి , అనుభ వపూర్వకమైన అభ్యాసాన్ని వారికి లోతైన అవ గాహనని అందిస్తునీదని ఇటువంటి పర్యటనలు పిల్లలకి ఎంతో ఉపయోగపడ తాయని చైర్మన్ ఇ.ప్రసాద రావు తెలిపారు. ఈ పర్యటనలో సమన్వయకర్త శ్వేత, తరగతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కృషి విజ్ఞాన కేంద్రానికి అవార్డులు




**పెద్దపల్లి,జూన్ 30(జనంసాక్షి) :** కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ వర్క్ షాప్ లో రామగిరి కృషి విజ్ఞాన్ కేంద్రం రెండు అవార్డులను గెలుచుకుందనీ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కో ఆరినేటర్, ఎంఎం హెడ్ డాక్టర్ ఏ.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన

మిగతా 2లో..

నేటి నుంచి

# అమల్లోకి కొత్త చట్టాలు

## విడతలవారీగా అధికారులకు, సిబ్బందికి శిక్షణ పూర్తి: ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల బ్యూరో (జనంసాక్షి):** నేటి నుంచి భారత ప్రభుత్వ నూతన నేరన్యాయ చట్టాలు-2023 అమలులోకి రానున్నట్లు జిల్లా ఎస్పి పేర్కొన్నారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం లభిస్తాయన్నారు. అమల్లోకి రానున్న కొత్త చట్టాలు మనదేశ అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయని పేర్కొన్నారు. ఈ నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వస్తుందని, ప్రజలకి మరింత సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత మరియు భారతీయ సాక్ష్యా అధినియం. జిల్లాలోని ఉన్న పోలీసు అదికారులకు , సిబ్బందికి విడతలవారీగా శిక్షణ కార్యక్రమని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం మరియు వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందని అన్నారు. కొత్త చట్టాల వర్తింపు నేరాలు దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డిఎస్పీ నుండి కానిస్టేబుల్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.





భూ నిర్వాసితులకు

# చట్ట ప్రకారం నష్ట పరిహారం

## అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్

**పెద్దపల్లి,జూన్ 30(జనంసాక్షి) :** వరంగల్ -మంచిర్యాల మధ్య 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణంలో తమ భూములు, ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులకు చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు.శనివారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి భూ నిర్వాసితులతో సమావేశమై వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ వరంగల్-మంచిర్యాల మధ్య 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు చట్ట ప్రకారం వీలైనంత మేరకు అధికంగా నష్టపరిహారం వచ్చే విధంగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని అన్నారు.జాతీయ రహదారుల నిర్మాణ అలైన్మెంట్ ను కేంద్రం పరిధిలోని సంస్థ నిర్ణయిస్తుందని, అలైన్మెంట్ మార్పు తమ చేతులలో ఉండదని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల తాము నష్టపోతున్నట్లు అందించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించి చట్ట ప్రకారం పరిహారం అందజేస్తామని తెలిపారు. భూములకు చట్ట ప్రకారం రేటు చెల్లించడంతో పాటు, ఆ భూములలో ఉన్న బోర్లు, బావులు, చెట్లు, మోటార్లు, ఇండ్లు, పైప్ లైన్ మొదలగు ఆస్తులకు విలువ కట్టి నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు, భూ నిర్వాసితులు, తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ దశాబ్ది రాష్ట్ర కార్యవర్గ సమావేశం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆవిర్భావించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ దశాబ్ది సమావేశం కరీంనగర్ లో ఏర్పాటు చేయనైనది. ఈ సమావేశానికి గుర్రాల మల్లేశం ముదిరాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా బండ ప్రకాష్ ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ గా విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రములో ముదిరాజుల అభివృద్ధికి ముదిరాజ్ మహాసభ ఎంతో కృషిచేసి ఎన్నో జీవోలను తెచ్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అభయ హస్తం హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గములో పలు తీర్మానాలు తీర్మానిస్తూ ఆమోదించారు. ముదిరాజుల సమగ్రభివృద్ధికి ముదిరాజ్ మహాసభను సంస్థగతంగా బలోపేతం చేసి హక్కుల సాధనకై నిరంతరం పోరాడుతామన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ముదిరాజులు అధిక స్థానాల్లో గెలువాలని పిలుపిచ్చారు. ఈ సమావేశములో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల వెంకట నర్సయ్య, రాష్ట్ర యువతా అధ్యక్షులు పండుగ బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్, జిల్లా ఫిషరీష్ ఛైర్మెన్ పిట్టల రవీందర్, బండారి భూమేష్, బండారి నరేందర్, కొలిపాక మల్లికార్జున్ తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## వినతి పత్రం అందజేత

చందుర్తి(జనంసాక్షి): మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు రామన్నపేట ఎంపీటీసీ వేల్పుల వనజ దేవస్వామి రైతుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని అలాగే రామన్నపేట, తిమ్మాపూర్, అశిరెడ్డిపల్లి గ్రామాల ప్రజల ఆరోగ్య సౌకర్యార్థం పల్లె దవాఖానాను మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## జీడీకే.ఓసీపీ-5లో భాస్కర్‌రావు వర్ధంతి.

**గోదావరిఖని, జూన్ 30, (జనంసాక్షి) :** సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా జీడీకే.ఓసీపీ-5 ఆవరణలో ఎఐటీయూసీ పిట్ సెక్రెటరీ గుర్రం ప్రభుదాస్ ఆధ్వర్యంలో మాదిరెడ్డి భాస్కరరావు 33వ వర్ధంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి చందా తిరుపతి, సీనియర్ నాయకులు గండి ప్రసాద్, భోగ సతీష్, మల్లం తిరుపతి రాయుడు, శ్రీనివాస్, ఉదయభాను, వేముల రమేష్, రావిచెట్టి శ్రీనివాస్, ఆడిచర్ల అశోక్, మడ్డి కిరణ్, బ్రహ్మాచారి, పాపన్న, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



## వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ సమావేశం

### పాల్గొన్న మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్ బ్యూరో, జూన్ 30 (జనంసాక్షి) :**కరీంనగర్ లోని అన్నమనేని గార్డెన్ లో ఆదివారం రోజు వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ట్ 303 అసోసియేషన్ ఇన్ స్టాలేషన్ కెబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 23 వాకర్స్ అసోసియేషన్లు సభ్యులు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ స్థాయి వాకర్స్ క్లబ్ సంఘంలో జిల్లా వాకర్స్ సంఘాలు మెర్జ్ అయ్యాయి. వాకర్స్ ఇంటర్నేషనల్ 303 సమావేశానికి ముఖ్య అతిథిగా కాశ్మీర్ గడ్డ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నగర ప్రథమ పౌరులు మేయర్ యాదగిరి సునీల్ రావు , అన్నమనేని సుధాకర్ రావు అధ్యక్షతన పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి సమావేశాన్ని ప్రారంభం చేశారు. స్థానిక కార్పొరేటర్ జంగిలి ఐలేంధర్ యాదవ్ తో కలిసి వాకర్స్ ఇంటర్నేషనల్ 303 లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాకర్స్ అసోసియేషన్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సభ్యులతో మేయర్ యాదగిరి సునీల్ రావు తమ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు.



ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... నగర ప్రజలు ఆరోగ్యం మెరుగు పడి వారి జీవన విధానం పెరగాలని నగరపాలక సంస్థ ద్వారా నగరంలో పెద్ద ఎత్తున వాకింగ్ ట్రాకులు నిర్మాణం చేశామన్నారు. నగరంలోని 22 పార్కులను సుంధరీకరించడంతో పాటు మైదానాలను కూడ అభివృద్ధి చేసి 5 కోట్లతో 35 ఓపెన్ జిమ్ములు ఏర్పాటు చేశామన్నారు. ఈ వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ మీటింగ్ లో స్థానిక కార్పోరేటర్ ఐలేంధర్ యాదవ్, డిస్ట్రిక్ట్ గవర్నర్ బాడి మెంబర్ ఎల్లగౌడ్, కో ఆర్డినేటర్ అన్నమనేణి సుధాకర్ రావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ జగదీశ్వర్ గౌడ్, డిప్యూటీ గవర్నర్ గొట్టెముక్కుల రవీంధర్, రమణరెడ్డి, గౌతమ్ రెడ్డి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలి

గోదావరిఖని(జనంసాక్షి) :కేంద్ర బొగ్గు గనుల వేలం పాటను ఆపాలని..సింగరేణికి నేరుగా కేటాయించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రామిక భవన్ రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి.దీనికి ముందు భూపాల్ పార్టీ జెండా ఆవిష్కరణ చేయగా జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు క్లాసులకు ప్రారంభోపన్యాసం చేశారు.ఈ క్లాసులకు వేల్పుల కుమారస్వామి ప్రిన్సిపల్‌గా వ్యవహరించారుభూపాల్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలంపాట వేస్తున్నదని, సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలంపాటలో పోటీపడాలనే పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. నిజానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలన్నారు .కేంద్ర ప్రభుత్వం వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు బొగ్గు గనులు తవ్వే అవకాశం కల్పించడం సరైంది కాదన్నారు.రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం హేయమైన చర్య అని అన్నారు.బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి ఇంకా ఏమి మిగులుతుందని అన్నారు.క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి, నిర్వీర్యం చేసే ప్రయత్నం కేంద్రం చేస్తుందని అన్నారు.నగదీకరణ



పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందన్నారు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. కాబట్టి శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్ లను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వము అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభ తీర్మానం చేయాలని లేని పక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చూడుతామని హెచ్చరించారు.అదే విధంగా ఇండ్లు లేని నిరుపేదలు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 6 వందల మంది ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని సంవత్సరంన్నర నుండి అక్కడే నివాసం ఉంటున్నారు.పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు .ఇది సరైన నిర్ణయం కాదని అలాంటి నిర్ణయాలను వెంటనే విడనాడాలని అన్నారు. ఇందిరమ్మ అందించాలన్నారు. జిల్లా కార్యద్శివర్గ సభ్యులు మహేశ్వరి, రామాచారి ,జ్యోతి,శంకర్,గణేష్,శ్రీనివాస్,రవీందర్, నాయ కులు, కార్యకర్తలు నర్సయ్య,బిక్షపతి, ఓదెలు, లక్ష్మారెడ్డి,నాగ మణి,రాజమౌళి,సురేష్,శివకుమార్, ప్రశాంత్,సందీప్,భాగ్య,దీప,జమున,హమీద సృజన, క్రాంతి, రాము, రాజయ్య,లక్షినారాయణ పాల్గొన్నారు.

## సింగరేణి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

**గోదావరిఖని(జనంసాక్షి)** :రామగుండం మండలం మల్కాపూర్ శివారు సర్వేనెంబర్ 83లో గల సింగరేణి స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) పక్షాన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ రామగుండం మండలం మల్కాపూర్ శివారు సర్వే నెంబర్ 83లో గల సింగరేణి స్థలం సాయి లీల బార్ అండ్ రెస్టారెంట్ కు ఆనుకొని ఉండడం వల్ల ఆ స్థలం కనబడకుండా చుట్టూ చెట్లు నాటి సాయిలీల యాజమాన్యం వారు దానినీ పార్కింగ్ స్థలంగా వాడుకుంటూ ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని సూర్య ఎంఎల్ఏకు తెలిపారు. సింగరేణి స్థలాన్ని వారు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని దాదాపు 8 నుండి 10 గుంటల భూమి సుమారు రెండు కోట్లు విలువ చేసే స్థలాన్ని కాపాడడానికి సింగరేణి వెంటనే స్పందించి ఆ స్థలం చుట్టూ ప్రహరి నిర్మాణం చేయాలని కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రామగుండం



పారిశ్రామిక ప్రాంతంలో వాణిజ్యపరంగా విలువైన సింగరేణి భూములు అనేకం కబ్జాలకు గురవుతున్నాయని దీని వెనుక సింగరేణి ఎస్టేట్ అధికారుల ఉన్నతాధికారుల అవినీతి కచ్చితంగా ఉందని సూర్య ఆరోపించారు కళ్ళ ముందు సింగరేణి స్థలాలు కబ్జా అవుతున్న దున్నపోతుపై వాన పడ్డ చందంగా ఈ అధికారులు వ్యవహరిస్తున్నారని దుయ్యపట్టారు. సింగరేణి ఏరియాల్లో చిన్న రేకుల షెడ్డు వేసుకుంటేనే అప్పటికప్పుడు అక్కడ వాలిపోయే ఎస్ అండ్ పిసి అధికారులు కోట్ల రూపాయల విలువ చేసే సింగరేణి భూములు కబ్జాకు గురవుతున్న కనీసం అటువైపు చూసే పరిస్థితి లేకపోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. విచారణ జరిపి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..

## కృషి విజ్ఞాన కేంద్రానికి అవార్డులు

విశ్వవిద్యాలయం పరిధిలోని రామగిరి ఖిల్లా జూన్ 25 నుండి జూన్ 27 వరకు రాజమండ్రి లోని జాతీయ పొగాకు పరిశోధన సంస్థలో జరిగిన కృషీ విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ వర్క్ షాప్ 2024-25 లో పాల్గొనడం జరిగిందన్నారు. సింగరేణి వంటి సంస్థల ద్వారా రైతులకు సేంద్రియ వ్యవసాయం ద్వారా పండ్లు, కూరగాయల పెంపకం, మహిళలకు మగ్గం, ఎంబ్రాయిడరీ, విలువ ఆధారిత పదార్థాల తయారీ వాటిపైన శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రైతు అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల్లో చేపడుతూ రైతు అభివృద్ధికి తోడ్పడతామని ఏ.శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.

## బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్

సమానంగా చూస్తున్నాం. మేం కూడా మీలాగే వ్యవహరిస్తే తెలంగాణకు నష్టం జరుగుతుంది. ప్రజలు నష్టపోతారు. అందుకే మాకు ఆ ఆలోచన లేదు. రాష్ట్ర మంత్రులు కేంద్రాన్ని కలిస్తే పూర్తిగా సహకరిస్తున్నాం. నిధులిస్తున్నాం. మా మంచి తనాన్ని పిరికితనంగా భావిస్తే మీకే నస్టమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

**టీ 20 విజయంపై....**

టీ 20 ప్రపంచ కప్ లో భారత్ విజయం సాధించడం సంతోషం. 140 కోట్ల మంది ఆనందంతో ఉన్నారు. భారత్ గెలవాలని ప్రతి ఒక్కరూ మనస్పూర్తిగా కోరుకున్నరు. ఈ దేశమ్మీద భక్తిభావం ఉన్న వారంతా టీవీల్లో వీక్షించారు. ప్రతి భారతీయుడు తానే గెలిచినట్లుగా సంతోషపడుతున్నడు. ఇంత గొప్ప విజయాన్ని అందించిన భారత టీంకు శుభాకాంక్షలు. గతంలో రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన స్మృతులను గుర్తు చేసుకుంటున్నారు.

## బొగ్గు బ్లాక్‌ల వేలానికి పోతున్న బీజేపీ..

### ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్మపురి..నర్సింహారెడ్డి..

**గోదావరిఖని, జూన్ 30, (జనంసాక్షి) :** బొగ్గు బ్లాక్‌ల వేలానికే బీజేపీ ప్రభుత్వం మొగ్గు చూపిస్తుందని..తెలంగాణకు బొగ్గు ఖనిజాల నిలయం సింగరేణి సంస్థ అని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పి.ధర్మపురి, ఎస్.నర్సింహారెడ్డి అన్నారు.స్థానిక జనక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.10 సంవత్సరాల పాలనలో టిఆర్ఎస్, బిజెపిలో ఆర్థిక విధ్వంసం సృష్టించి..మొసలి కన్నీరు కాస్తున్నాయన్నారు.ఐఎన్‌టియుసి కార్మికుల పక్షాన్ని పోరాటం చేస్తుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంతిరెడ్డి సారథ్యంలో బట్టి విక్రమార్క, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, ఐఎన్‌టిసి నాయకులు సంజీవరెడ్డి, జనక్‌ప్రసాద్ కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, ఎంపీల ఆధ్వర్యంలో ప్రధాని మోదీని కలిసి వేలంపాట ఆపే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామని అన్నారు.సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తి మీద ఉన్న ధ్యాస..సంక్షేమంపై లేదన్నారు.నూతన బొగ్గు గనుల తవ్వకాలను చేపట్టాలని, కార్మికుల సంక్షేమం, మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు.ఎంఎండీఆర్ యాక్టివ్ ఆర్థిక సంస్కరణలో భాగంగా పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా యాక్ట్ తెచ్చారని, వేలంపాట వేయమని, ప్రైవేటీకరణకు చూడాలని మాత్రం కాదని గుర్తు చేశారు.టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవంతి గ్రూప్స్, అరబిందో ఫార్మసీకి టెండర్ పొందాయని, ఒక్క తట్ట బొగ్గు తీయలేదని ధర్మపురి, నర్సింహారెడ్డి పేర్కొన్నారు.అందుకే సింగరేణి సంస్థకే బొగ్గు గనులు ఇవ్వాలన్నారు. విలేకరుల సమావేశంలో లక్ష్మీపతిగౌడ్, సదానందం, టైసన్ శ్రీను, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, సాగర్, వడ్డేపల్లి దాస్, జగన్మోహన్, నరసయ్య, సంపత్, ఆంజనేయులు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ భూముల్ని అప్పనంగా అంటగట్టిండు

## కాంగ్రెస్ పార్టీ జిల్లా నియోజకవర్గ ఇంచార్జి కే.కే. మహేందర్ రెడ్డి



**సిరిసిల్ల టౌన్ జూన్ 30( జనం సాక్షి)** ప్రభుత్వ భూముల్ని శాసనసభ్యులు కేటీఆర్ తన అనుయా యులకు పంచి పెట్టిండని కాంగ్రెస్ పార్టీ జిల్లా నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆరోపించారు. సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు, గత ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో బంగారు తెలంగాణ పేరిట తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్న దోపిడి దొంగలని, బతుకమ్మ చీరల పేరిట ఇక్కడి నేత కార్మికుల బతుకుల్ని బజారుపాలు చేశారని, సకాలంలో ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా 275 కోట్లు బకాయిలు పెడితే 110కోట్లరూపాయల్ని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు, రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పుల్లోకి నెట్టిందని ఆ అప్పులను వాయిదాలవారీగా కడుతున్నామన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ విద్యుత్ కేటగిరి నాలుగు నుంచి కేటగిరి మూడులోకి, ఎస్ఎస్ ఐ యూనిట్లకు మార్చితే ఆ విద్యుత్ బిల్లులను ఆసాములు కట్టలేకపోతున్నారని అన్నారు. కరెంటు సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. సభ్య సమాజం తలదించుకునేలా నేరెళ్ళ సంఘటన జరిగితే కూడా నోరెత్తలేదని అన్నారు. ప్రభుత్వ భూముల్ని శాసనసభ్యులు కేటీఆర్ అప్పనంగా ఎవరెవరికి దానం చేసాడో బండారం బయట పెడతానన్నారు. తంగళ్ళపల్లి మండలంలో 255 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తే విధివిధానాల్ని తుంగలో తొక్కి 255 ఎకరాల భూమిని 350 మందికి పంచాడని, అసలైన లబ్ధిదారులకు ఇవ్వకుండా అడుగులకు మడుగులోత్తే వారికి, ప్రజాప్రతినిధులకు, భూములు ఉన్నవారికి ఇచ్చాడని ఆరోపించారు. ప్రజా ప్రతినిధుల్లోఉన్న పేదలకు,అర్హత ఉంటే ఇవ్వవచ్చు దానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అన్నింటికి తిలోదకాలు ఇచ్చి విధి విధానాలు లేకుండా తమ ఇష్టారాజ్యంగా రికార్డులు లేకుండా ప్రభుత్వాన్ని నడిపించారని, టిఆర్ఎస్, బిజెపిల పార్టీలు అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడం కాదు ప్రజా పాలనలో ఉన్న ప్రభుత్వం వద్దకు వెళ్లి ప్రజా సమస్యల్ని పరిష్కరించాలని హితవు పలికారు .ప్రజా స్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఉంటుంది, ఇప్పటికైనా కేటీఆర్ తన వైఖరి మార్చుకోవాలని, వాస్తవాలకు దగ్గరగా నడుచుకోవాలని విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, వైద్య శివప్రసాద్, గడ్డం నరసయ్య, సిరిసిల్ల రవి తదితరులు పాల్గొన్నారు

# నేతన్న పోరు యాత్రను విజయవంతం చేయండి

## కార్మిక నాయకులు కూరపాటి రమేష్

**సిరిసిల్ల టౌన్ జూన్ 30 (జనం సాక్షి)** జులై ఏడు నుండి 15 వరకు జరుగుతున్న నేతన్న పోరు యాత్ర నేతన్న గర్జన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ పవర్ లూంవర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. సిరిసిల్లలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో వస్త్ర పరిశ్రమ అనుబంధాల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ పవర్ లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరపాటి రమేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. నేత కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వాలు ఉపాధి కల్పించాలని కోరుతూ చేపట్టిన నేతన్న పోరు యాత్ర సిఐటియు ఆధ్వర్యంలో జూలై 7న సిరిసిల్ల నుండి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేనేత పవర్ లూం ముఖ్య కేంద్రాలలో పర్యటించి సమస్యలను తెలుసుకుని జూలై 15న చలో హైదరాబాద్ నేతన్న గర్జన సభను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నేతన్న పోరు యాత్రలో అన్ని వస్త్ర పరిశ్రమ అనుబంధాల సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు గోలి వెంకటరమణ, ఆడెపు భాస్కర్, తాటిపాముల దామోదర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, మంచే శ్రీనివాస్, గౌడ రాజు, గోనే పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.



# ధైర్యసాహసాలకు మారుపేరు ఛత్రపతి శివాజీ

## లాడేగాంలో ఘనంగా శివాజీ విగ్రహావిష్కరణ



**కామారెడ్డి జుక్కల్ జూన్ 30 (జనం సాక్షి)**పౌరులంతా ఛత్రపతి శివాజీ వీరత్వాన్ని అందిపుచ్చుకొని నవ సమాజ నిర్మాణానికి పాటుపడాలని లాడేగాం గ్రామ పెద్దలు అన్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ జుక్కల్ మండలంలో గల లాడేగాంలో ఆదివారం నాడు శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలుత గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం చేసిన సమావేశంలో గ్రామ పెద్దలు మాట్లాడారు. శివాజీ యుద్ధ నైపుణ్యం, పరిపాలన ఆదర్శమని కొనియాడారు. ధైర్యసాహసాలకు మారు పేరు ఛత్రపతి శివాజీ అని గుర్తుచేశారు. మత సామరస్యాన్ని చాటారని తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు కులమతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరీ కృషి ఉందని పేర్కొన్నారు. ప్రజలే ప్రభువులుగా పాలన సాగిందన్నారు. శివాజీ ఎన్నో యుద్ధాలు చేసినా హింసను ప్రోత్సహించలేదన్నారు. పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదన్నారు. కార్యక్రమంలో శివాజీ పటేల్, రాజశేఖర్ పటేల్, తానాజీ పటేల్, ప్రశాంత్ పటేల్, కునాల్ పటేల్, అజింక్ పటేల్ మరియు విష్ణు, బాలాజీ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కమ్మర్పల్లి30జూన్(జనంసాక్షి)**మండలంలో ఉప్లూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం రోజున పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 15 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులంతా కలిసి వారి యొక్క యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి క్లాస్ రూములను తిరిగి చూస్తూ గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పూలదండ శాలవ జ్ఞాపికలతో సన్మానించుకొని వారి యొక్క ఆశీస్సులను తీసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందంగా గడిపారు.

# ఎస్జిటిలకు ఆప్షన్ గడువు పెంచాలి

## టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పాకాల శంకర్ గౌడ్

**సిరిసిల్ల టౌన్ జూన్ 30 (జనం సాక్షి)** సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఖాళీలన్నీ బదిలీల్లో చూపించాలని టి.ఎస్,యుటి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాకాల శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్లలోని కుసుమ రామయ్య జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్స్, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయుల బదిలీలకు వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని టి ఎస్ యుటిఎఫ్ పక్షాన ఖండిస్తున్నామన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యను అనుసరించి అదనపు పోస్టులను బ్లాక్ చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించడం లేదన్నారు. సాఫ్ట్వేర్ లోపాలు, సర్వర్ సమస్యలకు తోడు అప్రకటిత రేషనలైజేషన్ బదిలీలప్రక్రియను అపహాస్యం చేస్తుందన్నారు. పదోన్నతుల షెడ్యూల్లో లేని హేతుబద్దీకరణను మధ్యలోకి తెచ్చి కేవలం ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలో అమలు చేయడం గందరగోళానికి గురి చేస్తుందని, కోర్టు కేసులను బూచి గా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్ జి టి లకు ఆప్షన్ గడువును ఒక్కరోజు ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడటం సమంజసం కాదన్నారు. జిల్లాలో బదిలీ కోసం 562 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు అప్లై చేసుకున్నారని, అంతర్గత రేషనలైజేషన్ జరగడం వల్ల ఎస్జీటీలకు అన్యాయం జరుగుతుందని అవసరమైతే ప్రక్రియను రెండు రోజులు వాయిదా వేసి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో మహేందర్ రావు తదితరులు ఉన్నారు




# ఘన సన్మానం

**ఇబ్రహీంపట్నం , జూన్ 30 ,( జనం సాక్షి)** ఇబ్ర హీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు , సమాజ సేవకులు పెంట లింబాద్రి గ్రామంలో కరోనా టైం లో ఉపాధి కూలీలు కు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు , టాబ్లెట్లు , పేద ప్రజలకు వైద్య సేవలు అందించినందుకు గాను , కరీంనగర్ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సాహితి వేదిక పై అవార్డు గ్రహీతగా ఎంపిక చేసి , ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రాధనం చేసి , ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ నివేదిక సభ్యులు, సినీ నటులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి అమ్మ ఫౌండేషన్

## సభ్యులు బియ్యం అందజేత



**వీణవంక జూన్ 30 (జనం సాక్షి)** వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనుకం చంద్రయ్య గత వారం అనారోగ్యంతో మృతి చెందగా.ఇట్టి విషయాన్ని తెలుసుకున్న అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి సంస్థ సభ్యులందరూ కలసి ఈ నిరుపేద కుటుం బానికి 25 కిలోల బియ్యం అందజేశారు అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్వచ్ఛందంగా పలు కార్యక్రమాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వారు గుర్తు చేస్తూ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారుఈ కార్యక్రమంలో వ్యవస్థాపకఅధ్యక్షులు గోనెల సమ్మయ్య ముదిరాజ్ కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్.గౌరవ అధ్యక్షులుకొలిపాక రామస్వామి సభ్యులు పల్లెర్ల కిరణ్. గంధం సుమన్.గంధం ప్రశాంత్.దూలం సురేష్.కర్ర సాయిరాం.మడ్డి కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# మన్‌కీ బాత్‌లో నరేంద్ర మోడీ

**గోదావరిఖని, జూన్ 30, (జనంసాక్షి)** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం జనగామ మండలంలో 79వ బూత్ అధ్యక్షులు రాదండి శ్రీనాథ్ ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ 3వసారి ప్రధాని అయి మొదటిసారిగా మన్‌కి బాత్ కార్యక్రమంలో మాట్లా డారు. మా న్‌కి బాత్ కార్యక్రమం వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ .కూమార్ హాజరయ్యారు. జనగామ మండలం అధ్యక్షులు గుండెబోయిన భూమయ్య, కొము రవెల్లి విశ్వనాథ్, వీరకుమార్, గొడుగు సమయ్య, సంభోజ సురేష్, రాదండి శ్రీకాంత్, మేకల ప్రవీణ్,సంతోష్, వెంకటేష్,అశోక్, శ్రీకాంత్,రాజబాబు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గా బలిదాస్ దివాస్ సందర్భంగా మొక్కలు నాటిన అంజా గౌడ్, మల్లారెడ్డి



**ముస్తాబాద్ జూన్ 30( జనం సాక్షి)**డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గ బలిదాన్ దివస్‌సందర్భంగా దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ పర్యావరణహితం లక్ష్యంగా అమ్మ పేరుతో మొక్కలు నాటేలా గొప్ప కార్యక్రమానికి ఇచ్చిన పిలుపులో భాగంగా ముస్తాబాద్ బీజేపీ మండల అధ్యక్షుడు మేరుగు ఆంజగౌడ్ వారి అమ్మతో కలిసి ఇంటి ఆవరణలో మొక్క నాటారు. అదేవిధంగా చికోడు గ్రామంలో అసెంబ్లీ కన్వావీనర్ చికోడు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలు, కశ్మీర్ కోసం వారు చేసి బలిదానం, దేశం కోసం త్యాగం చేసిన ముఖర్జీ సేవలను స్మరించుకునేలా కార్యక్రమం కు పిలుపు ఇచ్చిందని తెలిపారు నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో ఆర్టికల్ 370 ను తొలగించి జమ్మూ కాశ్మీర్‌ను భారతదేశంలో కలపడం ద్వారా దేశాన్ని ఒక బలమైన%ొా% ఐక్య దేశంగా చూడాలనే డాక్టర్ ముఖర్జీ కలను సాకారం చేశారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన అమ్మ కోసం ఒక మొక్క నాటుదాం కార్యక్రమం లో మొక్కలునాటి వాటిని సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయలని కోరారు

## మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 30 (జనం సాక్షి)**భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడ వసారి ప్రధానమంత్రి అయిన తరువాత నిర్వహించిన మొదటి మన్ కి బాత్ కార్యక్రమాన్ని కామారెడ్డి పట్టణంలోని 249 వ పోలింగ్ బూత్ లో మోదీ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా కామారెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోది ప్రతి నెల నాల్గవ ఆదివారం నిర్వహించే మన్ కి బాత్ కార్యక్రమం 111 వారాల నుండి నిర్విరామంగా కొనసాగుతుందని ఎన్నికల .ఈ కార్యక్రమంలో లక్మారెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, నంది వేణు, సంతోష్ రెడ్డి, రాజేష్, భరత్, రాజ గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులకు పంచ్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

**ముస్తాబాద్ జూన్ 30( జనం సాక్షి)**కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త ముసాయి దా చట్టని తీసుకు వచ్చింది 10 పాస్ అయితేనే సర్పంచి పదవి వర్తించేలా కొత్త చట్టాన్ని కేంద్రం తీసుకొని వచ్చింది, ఈ చట్టాన్ని అంగీకరిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ఈ విషయంపై తెలంగాణలోని విద్యావేత్త అంతా కేంద్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకు ఒదంటూ కొనియాడారు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పై ప్రజాప్రతినిధులు దేశంలోని ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు

## ముస్తాబాద్ సహకార సంఘం సీవో గా మొత్తం భార్గవరెడ్డి

**ముస్తాబాద్ జూన్ 30( జనం సాక్షి)**ముస్తాబాద్ సహకార సంఘం సీఈఓగా ముద్దం భార్గవ్ రెడ్డి నియమితులైనట్లు ఆ సంఘం చైర్మన్ అన్నం రాజేందర్రెడ్డి తెలిపారు గతంలో ఉన్న సివో బాలయ్య ఉద్యోగ విరమణ కావడంతో కొత్తగా సీఈవోగా భార్గవ్ రెడ్డిని నియమించినట్లు తెలిపారు రైతులకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందిస్తామని ముద్దం తెలిపారు

## ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో పెడితే వేటు తప్పదు




**ముస్తాబాద్ జోన్ 30 (జనం సాక్షి)**ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో పెడితే వేటు తప్పదు' ధరణిలో భూ సమస్యల పరిష్కారానికి సంబంధించిన దరఖాస్తులను పెండింగ్ లో పెడితే వేటు తప్పదని తెలంగాణ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అధికారులను హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 2.34 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, 2 వారాల్లో 24,778 మాత్రమే పరిష్కరించారని పలు జిల్లాల కలెక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీవోల పనితీరుపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.

# నల్లనేలపై ఎర్రని సూర్యుడు భాస్కర్‌రావు

### హక్కుల కోసం నిరంతర పోరాట యోధుడు
### కార్మిక సంక్షేమం కోసం పరితపించిన మహానేత భాస్కర్‌రావు




**గోదావరిఖని, జూన్ 30, (జనంసాక్షి)** :నల్లనేలపై ఎర్రని సూర్యుడు భాస్కర్‌రావు అని, కార్మికుల హక్కు ల కోసం నిరంతర పోరాట యోధుడని, కార్మికుల సంక్షేమం కోసం పరితపించిన మహానేత భాస్కర్ రావు అని పలువురు ఏఐటియుసి, సిపిఐ నాయకులు కొనియాడారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో దివంగత ఏఐటియుసి నేత, అమరజీవి మాదిరెడ్డి భాస్కర్‌రావు 33వ వర్ధంతి సందర్భంగా జరిగిన సభలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజు పాల్గొని మాట్లాడుతూ గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి బొగ్గు గనులు ఏర్పడిన తర్వాత కార్మిక వర్గానికి సేవ చేయడానికి 1963లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా ఉన్న బి.విటల్‌రావు భాస్కర్‌రావును కొత్తగూడెం నుంచి ఒక ట్రైపు మిషన్ ఇచ్చి గోదావరిఖనికి పంపించడం జరిగిందన్నారు. భాస్కర్‌రావు గోదావరిఖని రాంనగర్‌లో ఒక గుడిసెలో నివాసం ఉంటూ, సూపర్‌బజార్ దగ్గరలో యూనియన్ ఆఫీసును ఏర్పాటు చేసి, కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తూ సేవలందించిన మహానేత భాస్కర్‌రావు అని వారు కొనియాడారు. ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి ఏఐటియుసిని, సిపిఐ పార్టీని బలోపేతం చేసి ఎంతో మంది నాయకులను తయారు చేశాడని వారు పేర్కొన్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి మొదటి తరం నేత అమరజీవి భాస్కర్‌రావు అని వారు పేర్కొన్నారు. ఆనాడు గోదా వరిఖనిలో కార్మికులు ఉండే బస్తీలకు పేర్లు పెట్టి, కార్మికుల కుటుంబాలకు విద్యా, వైద్యం, రోడ్లు , త్రాగు నీటి వసతి, విద్యుత్ తదితర సౌకర్యాలను ఏర్పాటు కోసం సింగరేణి యాజమాన్యం తో మాట్లాడి ఏర్పాటు చేయించిన ఘనత భాస్కర్ రావు కె దక్కుతుందని వారు పేర్కొన్నారు. ఏఐటియుసి లో చురుకుగా పని చేస్తున్న భాస్కర్ రావు ను ఓర్వలేక కొంత మంది దుర్మార్గులు ప్రజా సేవ పేరుతో ఆయనను హత్య చేశారని, ఆయన మరణించిన అతని ఆశయ సాధన కోసం గత ముప్పై మూడు సంవత్సరాలుగా కార్మిక వర్గానికి ఆయన పేరుతో భాస్కర్ రావు భవన్ నిర్మించుకొని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గా సేవలు అందించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కార్మిక వర్గం ఐక్యంగా ఉండి కార్మికుల హక్కుల కోసం, సంస్థ రక్షణ కోసం కృషి చేస్తూ ఏఐటియుసి, సిపిఐ ని బలోపేతం చేయాలని వారు కోరారు. సభకు ముందు జి.ఎం.ఆఫీస్ చౌరస్తా వద్ద ఉన్న భాస్కర్ రావు విగ్రహానికి, భాస్కర్ రావు భవన్లో జరిగిన వర్ధంతి సభ లో ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు వేల్పుల నారాయణ, ఎం.శేష్ కుమార్, ఎం.శ్రీదర్, బి.కనకయ్య, మద్దెల దినేష్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్‌తో పాటు ఆయా గనుల పిట్ కార్యదర్శులు పాల్గొనగా, ప్రజా నాట్య మండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, చీకటి అంజయ్య, వై.లెనిన్, రొంటాల లింగయ్య, సదా మల్లేశ్ తో పాటు కళాకారులు దయానర్సింగ్, కొప్పుల రాజనర్సు స్మృతి గీతాలు ఆలపించారు.

# విప్లవోద్యమ నిర్మాణమే ఏకైక మార్గం

### మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు నందిరామయ్య పిలుపు




**గోదావరిఖని, జూన్ 30, (జనంసాక్షి) :** సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశంలో పెద్దంపేట గ్రామానికి చెందిన యువ నాయకుడు బండి అశోక్ నాయకత్వంలో యువకులు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు నంది రామయ్య పాల్గొని మాట్లాడారు. దేశంలో సమసమానత్వం, ప్రజల మధ్య నెలకొన్న అంతరాలు పోవాలంటే ప్రజా చైతన్యం కావాలన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరును తీవ్ర తరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం మూడోసారి గద్దెనెక్కిన తర్వాత ప్రశ్నించే గొంతులపై దృష్టి పెట్టిందన్నారు. ఉపాను తలదన్నే విధంగా కొత్త చట్టాన్ని తెచ్చి ప్రశ్నించే గొంతులను అణగదొక్కాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు దోచి పెట్టాలని చూస్తున్న మోడీ ప్రభుత్వ చర్యలను అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. దీనికి భారతదేశంలో విప్లవోద్యమ నిర్మాణం జరగాలన్నారు. విప్లవోద్యమ సైన్యాన్ని నిర్మించాలని, ప్రజల్లో చైతన్యవంతం చేసి విప్లవోద్యమ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే మోడీ ప్రభుత్వ విధానాలను అడ్డుకోగలమన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజాపోరును మరింతగా తీవ్రతరం చేయాలని సూచించారు. దానిలో యువత ప్రధానపాత్రను పోషించాలని, ఆ దిశగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ప్రజా పోరాటాలను నిర్మిస్తున్నదన్నారు. ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, అంతర్గామ్ మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, పిఓడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి, పివైఎల్ రాష్ట్ర నాయకులు పెండ్యాల రమేష్,మాస్‌లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులు ఆడెపు శంకర్, మార్త రాములు,గూడూరి వైకుంతం,గొల్లపల్లి చంద్రయ్య, కట్ట తేజేశ్వర్, పెద్దపెల్లి డివిజన్ నాయకులు కొట్టే తిరుపతి, బండి అశోక్, రాయనర్సు, తదితరులు పాల్గొన్నారు.